# అభివృద్ధికి అండగా ప్రజలు నిలువాలి

- జడ్పీ చైర్‌పర్సన్ దీపిక



మద్దిరాల : గోరెంట్ల గ్రామంలో చేనేత కార్మికుడిని ఓటు అభ్యర్థిస్తున్న జడ్పీ చైర్మన్ దీపిక, ఎమ్మెల్యే కిశోర్‌కుమార్ సతీమణి కమల

మద్దిరాల, నవంబర్ 22 : తుంగతుర్తి ప్రాంతానికి బీఆర్ఎస్ ప్రభుత్వం పదేండ్లుగా చేసిన అభివృద్ధికి మద్దతుగా ప్రజలు కారు గుర్తుపై ఓటు వేసి మరోసారి బీఆర్ఎస్ ప్రభుత్వానికి అండగా నిలువాలని జడ్పీ చైర్‌పర్సన్ గుజ్జ దీపికాయుగేంధర్‌రావు కోరారు. బుధవారం ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ సతీమణి కమలతో కలిసి మండలంలోని గుమ్మడవెల్లి, కుక్కడం, గోరెంట్ల గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు తుంగతుర్తి ప్రాంతం ఎట్లుండే ఇప్పుడెట్లా మారిందో ప్రజలు గమనించాలని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ నాయకులు ఇచ్చిన హామీలు వాళ్లు పాలించే ఏ రాష్ట్రంలోనూ నెరవేర్చలేదని తెలిపారు. అధికారంలోకి రావడానికి తప్పుడు హామీలు గుప్పిస్తున్నట్లు దుయ్యబట్టారు. ఈ ప్రాంత ప్రజలుగా మీరు మనకు మంచి చేసింది ఎవరని గమనించి ఈ నెల 30న జరిగే ఎన్నికల్లో కారు గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యే కిశోర్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ గుడ్ల ఉపేంద్రావెంకన్న, జడ్పీటీసీ కన్న సురాంబావీరన్న, సర్పంచ్ అక్కిరెడ్డి జ్యోతీఉపేందర్‌రెడ్డి, రైతు బంధు సమితి జిల్లా కో-ఆర్డినేటర్ ఎస్‌ఏ రజాక్, వైస్ ఎంపీపీ బెజ్జంకి శ్రీరాంరెడ్డి, సర్పంచుల ఫోరం మండలాధ్యక్షుడు కుందూరు విష్ణువర్ధన్ రెడ్డి, తీగల వెంకన్న, కోడి శ్రీనివాస్, సర్పంచ్ దామెర్ల వెంకన్న, ఎంపీటీసీ శిరంశెట్టి వెంకన్న, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌కు ఓటేస్తే మళ్లీ చీకట్లే

- అభివృద్ధి చేశా.. ఆశీర్వదించండి
- ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్
- మోత్కూరు, అడ్డగూడూరు మండలాల్లో ఎన్నికల ప్రచారం



మోత్కూరు : సదర్శాపురంలో ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్, పక్కన బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి

మోత్కూరు, నవంబర్ 22 : కాంగ్రెస్‌ను నమ్మి ఓట్లు వేస్తే రాష్ట్రంలో మళ్లీ చిమ్మ చీకట్లేనని బీఆర్ఎస్ తుంగతుర్తి నియోజక వర్గ అభ్యర్థి, ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ అన్నారు. బుధవారం మోత్కూరు మండలంలోని సదర్శాపురం, దాచారంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు మంగళ హారతులు, కోలాటం ఆట పాటలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం గ్రామాల్లోని ప్రధాన కూడళ్ల వద్ద ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆశీస్సులతో తుంగతుర్తిని తాను పదేండ్లలో ఎంతో అభివృద్ధి చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు అభివృద్ధి, సంక్షేమ పథకాలను అందించిన బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. పదేండ్లలో ఏ ఒక్క రోజు తుంగతుర్తి నియోజక వర్గ ప్రజల బాగోగులు పట్టని కాంగ్రెస్ నాయకులు ఎన్నికలు రాగానే ఓట్ల కోసం వచ్చి ఎన్ని జిమ్మిక్కులను చేస్తున్నారో గమనించాలని, అటువంటి కాంగ్రెస్ నాయకులకు తగిన బుద్ధి చెప్పాలని ప్రజలను కోరారు. కాంగ్రెస్‌కు అధికారం ఇస్తే రైతులకు వ్యవసాయానికి 24 గంటల కరెంట్ ఇవ్వరన్నారు. రైతు బంధును బంద్ చేస్తారని విమర్శించారు. బునాదిగానీ కాల్వ అసంపూర్తి పనులను పూర్తి చేసి బస్వాపురం ప్రాజెక్ట్‌కు అనుసంధానం చేసి మోత్కూరు, అడ్డగూడూరుకు కాళేశ్వరం జలాలను తీసుకురావడానికి కృషి చేస్తానని తెలిపారు. తుంగతుర్తి నియోజక వర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తూ, ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండే తనను ఆశీర్వదించి మరోమారు గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆయిల్‌ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి, నియోజక వర్గం రాజకీయ పరిశీలకుడు నేవూరి ధర్మేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పొన్నెబోయిన రమేశ్, ఎంపీపీ రచ్చ కల్పనాలక్ష్మీనర్సింహారెడ్డి, ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ అశోక్‌రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు చిప్పలపల్లి మహేంద్రనాథ్, తీపిరెడ్డి మేఘారెడ్డి, కొణతం యాకూబ్‌రెడ్డి, ఆయా గ్రామ శాఖల అధ్యక్షులు దొండ నర్సయ్య, కడమంచి వస్తాద్, సర్పంచులు అండెం రజితారాజిరెడ్డి పాల్గొన్నారు.

## అయ్యప్ప ఆలయంలో ఎమ్మెల్యే చిరుమర్తి పూజలు

నార్కట్‌పల్లి, నవంబర్ 22: మండలకేంద్రంలోని హరిహరపుత్ర అయ్యప్ప స్వామి ఆలయంలో ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య బుధవారం పూజలు చేశారు. గురుస్వామి బెల్లి వెంకటేశ్వర్లు అధ్వర్యంలో ఎమ్మెల్యేకు స్వామివారి ఆశీస్సులు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే చేతులమీదుగా స్వాములకు భిక్ష నిర్వహించారు. ఆయనవెంట జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్ రెడ్డి, ఎంపీపీ సూదిరెడ్డి నరేందర్ రెడ్డి, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు దోసపాటి విష్ణు, పసునూరి శ్రీనివాస్, ఎంపీటీసీలు పుల్లెంల ముత్తయ్య, మేకల రాజిరెడ్డి, దుబ్బాక శ్రీధర్, మేడబోయిన శ్రీను, బొబ్బిలి మల్లేశ్, బాణాల భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు గ్రీన్ గ్రోవ్ పాఠశాల విద్యార్థులు

చిట్యాల, నవంబర్ 22 : చిట్యాల గ్రీన్ గ్రోవ్ పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల నల్లగొండలో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-17 విభాగంలో కే. అఖిల్‌నందన్, పి.అశ్విత, అండర్-14 విభాగంలో కే.నరేన్ కుమార్, ఎస్.యశ్వంత్, అండర్- 14 బాలికల విభాగంలో ఎస్‌కే అయేషా, జే.రమ్యలు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు గంగాపురం రాము బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

## బీఆర్ఎస్‌లో చేరికలు

అర్వపల్లి, నవంబర్ 22 : మండలంలోని కాసర్ల పహాడ్ గ్రామానికి చెందిన వివిధ పార్టీల సీనియర్ నాయకులు బీఆర్ఎస్ జిల్లా నాయకుడు బొడ్డు రామలింగయ్య ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో షేక్ మొగల్ సాబ్, షేక్ హుస్సేన్, పాషా, సోమయ్యతో పాటు మరికొందరు ఉన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు కసనబోయిన వెంకన్న, ఉయ్యాల రాము, వేముల గణేశ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



గులాబీ కండువా కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న జిల్లా నాయకుడు రామలింగయ్య

# కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి బొక్కబోర్లా..

- తుస్సుమన్న మల్లిఖార్జున ఖర్గే మీటింగ్
- ఖాళీ కుర్చీలతోనే కొనసాగిన ఖర్గే ప్రసంగం
- జనం లేక ప్రసంగానికి ముఖం చాటేసిన కోమటిరెడ్డి
- బీఆర్ఎస్ సభకు ధీటుగా అంటూ నవ్వులపాలు
- కేసీఆర్ మీటింగ్‌కు.. ఖర్గే మీటింగ్‌కు అస్మాన్ ఫరాక్
- కోమటిరెడ్డి ప్రగల్బాలతో నైరాశ్యంలో కాంగ్రెస్ శ్రేణులు



ఈ నెల 20న నల్లగొండలో సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభకు పెద్ద ఎత్తున హాజరైన జనజన సందోహం (ఫైల్)

నల్లగొండ ప్రతినిధి, నవంబర్22(నమస్తే తెలంగాణ) : సాధారణంగా ఒక పార్టీ అధినేతనో.. మరో ముఖ్య నేతనో ఒక అభ్యర్థికి మద్దతుగా ఎన్నికల ప్రచార సభలో పాల్గొంటున్నాడంటే అది మరింత ఊపునిచ్చేదిగా ఉండాలి. విజయానికి ఎంతోకొంత దోహద పడాలి. పార్టీ శ్రేణుల్లోనూ ఉత్తేజాన్ని నింపాలి. కానీ నల్లగొండలోని మర్రిగూడ బైపాస్ రోడ్డులో సోమవారం బీఆర్ఎస్ నిర్వహించిన సభాస్థలంలో అదే వేదిక మీద, అవే గ్యాలరీల నడుమ కోమటిరెడ్డి బుధవారం నిర్వహించిన కాంగ్రెస్ ప్రజా భరోసా సభ అట్టర్ ప్లాపైంది. ఈ సభకు జనాన్ని ఓ మాదిరిగా తరలించినా అసలు సమయానికి సభా ప్రాంగణం ఖాళీ కావడంతో తలలు పట్టుకోవడం కాంగెస్ శ్రేణుల వంతైంది. బీఆర్ఎస్ అభ్యర్థి కంచర్ల భూపాల్‌రెడ్డికి మద్దతుగా కేసీఆర్ పాల్గొన్న ప్రజా ఆశీర్వాద సభ గ్రాండ్ సక్సెస్ అయిన విషయం తెలిసిందే. సీఎం కేసీఆర్ ప్రసంగం ముగిసే వరకు జనం కదలకుండా అలాగే శ్రద్ధగా ఆలకించారు. బీఆర్ఎస్ సభకు మధ్యాహ్నం 3 గంటలకే తరలివచ్చిన జనం సాయంత్రం 5.18 గంటలకు సభ ముగిసే వరకు ఎక్కడ కూర్చున్న వాళ్లు అక్కడే కదలకుండా శ్రద్ధగా కేసీఆర్ ప్రసంగాన్ని ఆసాంతం ఆలకించారు. ఈ సభకు భారీగా జనం హాజరు కావడంతో ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి విజయం ఖాయమన్న చర్చ సర్వత్రా మొదలైంది. దీన్ని జీర్ణించుకోలేని కాంగ్రెస్ అభ్యర్థి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి లేని ఆడంబరాలకు పోయి బీఆర్ఎస్ నిర్వహించిన సభా స్థలంలోనే బుధవారం ఏఐసీసీ చీఫ్ మల్లిఖార్జున ఖర్గేతో బహిరంగ సభకు సిద్ధమయ్యారు. ఈ ప్రజా భరోసా సభకు మల్లిఖార్జున ఖర్గేతో పాటు రాష్ట వ్యవహారాల ఇన్‌చార్జి మణిక్‌రావుఠాక్రే, మాజీ పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హాజరైనా జనం నుంచి స్పందన కరువైంది. ముఖ్య అతిథిగా వచ్చిన మల్లిఖార్జున ఖర్గే ప్రసంగానికి ముందే జనం లేచి వెళ్లిపోయారు. ఆయన ప్రసంగం ప్రారంభించే సమయానికే సభా ప్రాంగణం దాదాపుగా ఖాళీ అయ్యింది. ఖర్గే ప్రసంగిస్తున్న సయమంలో జనం లేని సభ, ఖాళీ కుర్చీల వీడియోలు, ఫోటోలు సోషల్ మీడియాలోనూ వైరల్‌గా మారాయి. ఖర్గే సుమారు 25 నిమిషాల సమయం ప్రసంగానికి తీసుకోగా దాని తెలుగు అనువాదానికి మరో 15 నిమిషాలు పట్టింది. మొత్తం 40 నిమిషాల పాటు ప్రసంగం, దాని తెలుగు అనువాదం కొనసాగి పూర్తయ్యే సమయానికి సభా ప్రాంగణం పూర్తిగా ఖాళీ అయ్యింది. అక్కడక్కడా కాంగ్రెస్ కార్యకర్తలు మాత్రమే సభలో మిగిలారు. సభలో జనం వెళ్లిపోతుండడాన్ని గమనిస్తున్న కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాణిక్‌రావు ఠాక్రేతో ఖర్గే వైపు చూస్తూ తల పట్టుకోవడం కనిపించింది. కొసమెరుపు ఏటంటే కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి స్వాగతోపన్యాసం చేస్తూ మల్లికార్జున ఖర్గే మాట్లాడిన అనంతరం తాను 10 నిమిషాల పాటు నియోజకవర్గ అభివృద్ధిపై తన ప్రణాళికను ప్రకటిస్తానని చెప్పారు. కానీ తీరా ఖర్గే ప్రసంగం ముగిసే సరికే సభలో ఖాళీ కుర్చీలే మిగలడంతో వెంకట్‌రెడ్డి తన మ్యానిఫెస్టోను కూడా ప్రకటించలేకపోయారు. రెండు రోజుల తేడాతో జరిగిన బీఆర్ఎస్ భారీ బహిరంగ సభ, కాంగ్రెస్ వెలవెలబోయిన సభ జనంలో చర్చనీయాంశంగా మారింది. లేని ఆడంబరానికి పోయి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తన ఓటమిని ముందే ఖరారు చేసుకున్నాడన్న ఛలోక్తులు మొదలయ్యాయి.